క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు భద్రగిరి విద్యార్థిని



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినితో ప్రిన్సిపాల్ కమలకుమారి, ఉపాధ్యాయులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీ టీడబ్ల్యూఆర్ గరల్స్ స్కూల్ (పీటీజీ)లో 8వ తరగతి చదువుతున్న ఎం.జానకి రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి సోమవారం తెలిపారు. ఈ నెల 14 నుంచి గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగే పోటీల్లో అండర్–14 విభాగంలో పాల్గొనేందుకు సోమవారం విద్యార్థిని బయలుదేరి వెళ్లింది. ఈ సందర్భంగా విద్యార్థిని ఆమె అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ టి.తిరుపతినాయుడు, పీడీ ఎం.మాళి, పీఈటీ అరుణకుమారి ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సీతారామయ్య

జియ్యమ్మవలస: త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ కేవీ సీతారామయ్య సోమవారం పరిశీలించారు. మండలంలో ఇంతవరకు 575 మంది ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఓటరు జాబితాలో మరికొంత మంది పేర్లు నమోదు చేసుకున్నారని, వాటిని పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

15న రహదారి భద్రత కమిటీ సమావేశం

పార్వతీపురం టౌన్: రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని ఈనెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా రవాణాశాఖాధి సి.మల్లికార్జున రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలకు కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో శాఖల వారీగా చేపట్టాల్సిన రహదారి భద్రతా కార్యక్రమాలపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని రహదారి భద్రతా కమిటీ సభ్యులు అందరూ హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు



రికార్డులు, ఎంబుక్‌లను పరిశీలిస్తున్న ఆడిట్ బృందాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని 27 పంచాయతీల్లో ఉపాధిహామీ నిధులు రూ.21.13 కోట్లతో 2021 జనవరి 4 నుంచి 2022 మార్చి 31 వరకు చేపట్టిన అభివృద్ధి పనులపై మంగళవారం నుంచి సామాజిక తనిఖీలు చేపట్టనున్నారు. డీఆర్పీ సీహెచ్.వై.నాయుడు ఆధ్వర్యంలో ఆడిట్ బృందాలు గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో చేపట్టిన పనులు, రికార్డులు, ఎం-బుక్‌లను తనిఖీ చేయనున్నారు. ఈ మేరకు ఏపీఎం శివరామకృష్ణ సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం ద్వారా రూ.5 కోట్లతో మెటీరియల్ పనులు, వేతనదారులతో రూ.15.99 కోట్ల పనులు చేపట్టినట్లు చెప్పారు.

చురుగ్గా రహదారి నిర్మాణం



రోడ్డు చదును చేస్తున్న దృశ్యం

కురుపాం: నియోజకవర్గంలో గరుగుబిల్లి మండలం తోటపల్లి పాత బ్రిడ్జి నుంచి కురుపాం మండల కేంద్రం (గుణుపూర్ రోడ్డు) వరకు సుమారు 14 కిలోమీటర్ల మేర నూతన రహదారి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చొరవతో ప్రభుత్వం రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు రూ.40.50 కోట్లు కేటాయించింది. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఇటీవల రహదారి ఆక్రమణలు తొలగించారు. రహదారి నిర్మాణం పూర్తయితే ఈ మార్గంలో రాకపోకలు సాఫీగా సాగిపోతాయని స్థానికులు, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మార్చి నెలాఖరులోగా పూర్తిస్థాయిలో ఆక్రమణలను తొలగించి, రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ నాగమోహనరావు తెలిపారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

- డ్వామా పీడీ రామచంద్రరావు
- పలు గ్రామాల్లో ఉపాధి పనుల పరిశీలన



గరుగుబిల్లి: వేతనదారులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకం సిబ్బంది విధుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ కె.రామచంద్రరావు హెచ్చరించారు. మండలంలోని మరుపెంట, గొట్టివలస పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో క్షేత్రసహాయకులు లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి పనుల్లో పాల్గొనేలా వేతనదారులకు అవగాహన కల్పించాలని, వేతనం గిట్టుబాటు అయ్యేలా కొలతలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.

వేతనదారులందరికీ పని కల్పిస్తాం..

జియ్యమ్మవలస: ఉపాధిపని అడిగిన ప్రతీ వేతనదారునకు పని కల్పిస్తామని ఏపీఓ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తురకనాయుడువలసలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్‌కార్డులో పేరు ఉన్నవారు మాత్రమే పనులకు రావాలని, జాబ్‌కార్డు లేనివారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే కార్డు మంజూరు చేస్తామన్నారు. వేతనదారులు రెండు పూటలా పనులకు హాజరుకావాలన్నారు.

సక్రమంగా పనులు చేపట్టాలి

పాలకొండ: ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ డి.త్రినాథరావు తెలిపారు. మండలంలోని కొండాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల ఉపయోగం కోసం చేపడుతున్న పనులను సక్రమంగా పూర్తి చేయాలన్నారు.

వేతనదారుల సంఖ్య పెరిగాలి



జియ్యమ్మవలస: తురకనాయుడువలసలో మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు

వీరఘట్టం: ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే వేతనదారుల సంఖ్య పెరిగేలా చూడాలని ఎంపీడీఓ ఎ.ప్రభాకరరావు సూచించారు. ఉపాధి క్షేత్రసహాయకులతో సోమవారం సమావేశమై పలు సూచనలు చేశారు. వేతనదారులు సమయపాలన పాటించేలా చూడాలని, వేసవిని దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశాల వద్ద తాగునీరు, నీడ సౌకర్యం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పనులు చేసిన మేరకు కొలతలు నమోదు చేయాలని, ప్రతీ వేతనదారునికి గరిష్ఠ వేతనం వచ్చేలా చూడాలని సూచించారు.

• సువిశాలం.. ఆహ్లాదం





చెరువును ఆనుకుని ఉన్న రోడ్డు

ఈ చిత్రంలో కనిపిస్తున్నది వెంకమ్మ చెరువు. వీరఘట్టం పట్టణానికి రెండు కిలోమీట్ల దూరంలో పాలకొండ రోడ్డులో ఉంది. సుమారు 200 ఎకరాల్లో విస్తరించి ఉంది. సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. చెరువు చుట్టూ ప్రశాంత వాతావరణం. పక్కనే మరియగిరి పుణ్యక్షేత్రం. ఉదయం, సాయంత్ర సమయాల్లో వీరఘట్టం వాసులు వాకింగ్ చేసుకుంటూ ఇక్కడకు వచ్చి సేదతీరుతుంటారు. ఎంతో ఆహ్లాదకర వాతావరణం ఉండడంతో రోజురోజుకు వాకర్స్ సంఖ్య పెరుగుతోంది. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే బాగుంటుందని ఈ ప్రాంతం ప్రజల ఆకాంక్ష.

- వీరఘట్టం

గిరిజన స్పందనకు 38 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఏపీఓ రోసిరెడ్డి

సీతంపేట: స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన గిరిజన స్పందనకు 38 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. ఏపీఓ రోసిరెడ్డి వినతులు స్వీకరించారు. కొండపోడు భూమిలో రాతికట్టడాలు నిర్మించాలని పూతికవలసకు చెందిన సవర పార్వతి, రోగిని విశాఖపట్టణం కేజీహెచ్‌కు తరలించేందుకు అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ఇప్పగూడకు చెందిన గంగమ్మ అధికారులను కోరారు. కాంగూడ గ్రామంలో సామాజిక భవనం నిర్మించాలని గ్రామస్తులు వినతి ఇచ్చారు. కొత్త రేషన్‌కార్డు మంజూరు చేయాలని కుసుమూరుకు చెందిన బలరాం, కొండచీపుర్లు కొనుగోలుకు ఆర్థికసాయం చేయాలని కె.బలరాం, పాఠశాల విద్యార్థుల దుస్తులు కుట్టిన బిల్లులు ఇప్పించాలని బందపల్లికి చెందిన గీత కోరారు. ఆశ్రమ పాఠశాలలో వంటమనిషి ఉద్యోగం ఇప్పించాలని పెద్దకంబకు చెందిన శాంతికుమారి వినతి ఇచ్చారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం సంధ్యారాణి, సీడీపీఓ రంగలక్ష్మి, పీఏఓ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

పాలకొండ: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ త్రినాథరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజాల ఆరోగ్యం కోసం పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ నంబరు 610 అమలు చేసి, దాని ప్రకారం వేతనాలు అందించాలని కోరారు. ఆయనతో పాటు మండల కమిటీ సభ్యులు సీహెచ్ శంకరరావు, బి.రవికుమార్, జి.దుర్గారావు, కె.కూర్మారావు తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో విద్యార్థినుల మృతి



కోలక సుమిత్ర (ఫైల్)



కొండగొర్రి పవిత్ర (ఫైల్)

సీతంపేట: కొమరాడ, సీతంపేట మండలాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. సీతంపేట మండలంలోని పూతికవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని కొండగొర్రి పవిత్ర(15) అనారోగ్యంతో మృతి చెందింది. విద్యార్థిని గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని, గత నెల 28న పాఠశాల సిబ్బంది ఆమెను శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించినట్లు గిరిజన సంక్షేమశాఖ డీడీ నగేష్ తెలిపారు. పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందినట్టు చెప్పారు. విద్యార్థిని దహన సంస్కారాల ఖర్చులకు రూ.5వేలు చెల్లించనున్నామన్నారు.

కొమరాడలో..

కొమరాడ: మండలంలోని ఉలిపిరి గిరిజన బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని కోలక సుమిత్ర అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విద్యార్థినికి ఆదివారం మెడనొప్పి రావడంతో తల్లిదండ్రులు కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీకి తీసుకువెళ్లి వైద్యం అందించారు. ఫిట్స్ ఉందని, మెరుగైన వైద్యం అవసరమని అక్కడి వైద్యులు పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఎంఆర్‌ఐ స్కాన్ చేయించాల్సి రావడంతో అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే వసతిగృహంలో విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ లేకపోవడంతోనే విద్యార్థిని మృతి చెందిందని కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

పాలకొండ: జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ ఆదేశించారు. పట్టణంలోని సచివాలయాల సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయా సచివాలయాల పరిధిలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. మంజూరైన ఇళ్లు, నిర్మాణాలు ప్రారంభించినవి, ఇప్పటి వరకు పనులు ప్రారంభం కానివి, వివిధ దశల్లో ఉన్న ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. మెటీరియల్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెలలో నిర్మాణాలు శతశాతం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పంటలు ధ్వంసం



కొత్తూరు సమీపంలో గజరాజులు ధ్వంసం చేసిన కర్బూజా పంటను చూపుతున్న రైతు

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరు, శివ్వాం, సీమలవానివలస గ్రామాల సమీపంలో ఆదివారం రాత్రి ఏనుగులు గుంపు సంచరించి కర్బూజా పంటను ధ్వంసం చేశాయి. రెండు రోజులుగా నాగావళి కుడి కాలువ పరిధిలోని గ్రామాల్లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు అంటున్నారు. చేతికి అందిన పంటను ఏనుగులు పాడుచేయడంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజరాజుల గుంపు నుంచి పంటలను, ప్రాణాలను కాపాడాలని అధికారులను కోరుతున్నారు.

భారీ కంటైనర్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం



ఏబీరోడ్డులో ప్రయాణిస్తున్న భారీ కంటైనర్

భామిని: మండలంలోని ఏబీ రోడ్డులో నిత్యం భారీ వాహనాల రాకపోకలతో వాహన చోదకులకు ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. విశాఖపట్నం షిప్‌యార్డు నుంచి ఏబీరోడ్డు మీదుగా ఛత్తీస్‌గఢ్ వెళ్తున్న భారీ కంటైనర్ వాహనం సోమవారం రోడ్డు పక్కన కాసేపు నిలుపుదల చేశారు. సుమారు 108 టైర్లు కలిగిన ఈ భారీ వాహనాన్ని స్థానికులు ఆసక్తిగా చూశారు. అయితే ఏబీరోడ్డులో భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ సమస్యతో పాటు రోడ్డు పాడవుతోందని పలువురు ప్రయాణికులు అంటున్నారు.

ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

సీతంపేట: ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని కోరుతూ సోమవారం జరిగిన వారపుసంతలో గిరిజన సంఘం నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు పి.సాంబయ్య మాట్లాడుతూ జీఓ నంబర్ 3 అమలు చేయాలని, నాన్‌షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో గంగాధర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా లక్ష్మీనారాయణ

భామిని: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్లు, కో-కన్వీనర్లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. భామిని మండల కన్వీనర్‌గా ఎరుకు మజ్జి లక్ష్మీనారాయణ(శ్రీను), కో-కన్వీనర్లుగా తామరసిల్లి సురేష్, నిమ్మల త్రినాథ్, సరసా భద్ర రాజ్‌కుమార్, మలగాం కృష్ణలను నియమించింది.

నేడు మండల సమావేశం

భామిని: మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ తోట శాంతికుమారి అధ్యక్షతన మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ సభ్యులు, వివిధ శాఖల అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

రేప్ కేసు నమోదు

వీరఘట్టం: మండలంలోని బిటివాడ గ్రామానికి చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై రేప్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.హరికృష్ణ సోమవారం తెలిపారు. తనకు మాయమాటలు చెప్పి గత కొంత కాలంగా శారీరకంగా తనపై దాడిచేస్తూ ఇబ్బంది పెడుతున్నట్లు సదరు మహిళ ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై సీఐ మురళీధర్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

కూర్మరాజుపేటలో అగ్ని ప్రమాదం

సాలూరు: మండలంలోని కూర్మరాజుపేట సమీపంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక అధికారి బి.పైడిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోట ఈశ్వరరావు సుమారు రెండు ఎకరాలకు చెందిన గడ్డి కుప్పలను కళ్లంలో ఉంచగా... అగ్ని ప్రమాదంలో కాలిబూడిదయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

చిట్టీల వ్యాపారి టోకరా..

సాలూరు: చిట్టీల వ్యాపారి టోకరా పెట్టి పరారైన సంగతి వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలియజేసిన వివరాల మేరకు... పట్టణంలో గొర్లెవీధికి చెందిన మండవల్లి సోమశేఖర్ చిట్టీలు వేసేవాడు. మొదట్లో నమ్మకంగా వ్యవహరించడంతో ఎక్కువ మంది ఇతని వద్ద చిట్టీలు కట్టేవారు. కొద్ది రోజుల కిందట నుంచి సోమశేఖర్ కనిపించకుండా పోయాడు. సుమారు 11 లక్షల రూపాయలు నష్టపోయినట్లు బాధితులు ఆరోపిస్తూ సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వ్యాపారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పాపారావు తెలిపారు.

ఎన్నికల నియమావళి అమలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు

కొమరాడ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలని ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయ నాయకుల విగ్రహాలకు తెల్ల గుడ్డతో ముసుగు వేయాలన్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా గ్రామల్లో సంక్షేమ పథకాలు అందజేయాలని ఆదేశించారు. ఎవరైన ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చిరించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఎస్సై రాజేష్

గరుగుబిల్లి: విద్యార్థులు తమ భవిష్యత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సమాజం అభివృద్ధికి విద్యార్థులు తోడ్పడాలన్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో చదువుపట్ల ఏకాగ్రత వహించాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లకు, టీవీలకు వీలైనంత దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్ఎల్ పాత్రుడు, కె.రవీంద్ర, మహిళా పోలీసు భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల రక్షణ కమిటీ ఏర్పాటుకు చర్యలు



ఎంపీపీకి కమిటీ విధివిధానాలను వివరిస్తున్న సీడీపీఓ

పాలకొండ రూరల్: మండల స్థాయి బాలల రక్షణ కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఐసీడీఎస్ పీఓ గీత పేర్కొన్నారు. సోమవారం ఎంపీపీ బొమ్మాళి భానును కలిసి కమిటీల ఏర్పాటు, అందులో సభ్యులు, వారు నిర్వహించాల్సిన విధులపై చర్చించారు. ఈ కమిటీ చైర్మన్‌గా ఎంపీపీ, సభ్యులుగా జెడ్పీటీసీ, ఎంపీడీఓ, తహసీల్దార్, కన్వీనర్‌గా సీడీపీఓ, మెడికల్ ఆఫీసర్, ఎస్సై, ఎంఈఓతోపాటు ఎంఎంఎస్ అధ్యక్షులు, ఐకేపీ అధికారులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, యువసజ సంఘం సభ్యులు ఉంటారన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మేరీ తదితరులున్నారు.

కుష్టువ్యాధి నివారణపై అవగాహన



కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

పాలకొండ: మండలంలోని ఓని ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో సోమవారం కుష్టు వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ కనపాక రమణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అన్నవరం పీహెచ్‌సీ సిబ్బంది రామశేషు, నీలిమ, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. అనంతరం గ్రామంలో చైతన్య ర్యాలీ చేపట్టారు.

కాశీసుందర విశ్వేశ్వరస్వామికి పూజలు



పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ప్రతిష్ఠించిన పార్వతీ సమేత కాశీసుందర విశ్వేశ్వర స్వామిని రేగిడి, పాలకొండ జెట్పీటీసీ సభ్యులు పాలవలస ఇందుమతి, పాలవలస గౌరీపార్వతీ సోమవారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త, వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు వారికి ఆలయ విశిష్టతను, ఇక్కడ పరిసరాలను వివరించారు. వారితో పాటు చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

పాలకొండ రూరల్: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని ఎస్సై బి.శివప్రసాద్ కోరారు. పాలకొండ-విశాఖ రహదారి, వీరఘట్టం రహదారిలో సోమవారం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. వాహన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించారు. సరైన పత్రాలు లేనివారిపై అపరాధ రుసుం విధించారు. ఈ క్రమంలో అధిక లోడుతో వస్తున్న చెరుకు ట్రాక్టర్లు, లారీలను నిలుపుదల చేసి స్పష్టమైన సూచనలు చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.